## జొన్నలను కొనుగోలు చేయాలి



జొన్నల కొనుగోళ్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జాదవ్ అనిల్

నేరడిగొండ, ఏప్రిల్ 19 : రైతులు పండించిన జొన్న పంటను ప్రభుత్వం పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో జొన్నల కొనుగోళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం జొన్నల కొనుగోళ్లలో ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్లు కొనుగోలు చేయాలన్నారు. ప్రభుత్వం ఎకరాకు 8.60 క్వింటాళ్లు కొనుగోలుకు నిబంధనలు పెట్టడం సరికాదన్నారు. మిగతా జొన్నలు దళారులకు అమ్ముకొని రైతులు మోసపోతారని తెలిపారు. అందుకే ప్రభుత్వం పండిన పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలన్నారు. ముందుగా ఎమ్మెల్యేను పీఏసీఎస్ చైర్మన్ సాబ్లె కిశోర్‌సింగ్, పాలకవర్గం, సిబ్బంది సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ శివారెడ్డి, మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, నిమ్మల ప్రీతంరెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, వైస్ చైర్మన్ వెంకటరమణ, మాజీ సర్పంచ్ పెంట వెంకటరమణ, మాజీ ఎంపీటీసీ పండరి, నాయకులు గులాబ్‌సింగ్, వసంత్, సురేందర్, ప్రతాప్ సింగ్, శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

## విద్యుత్ షాక్‌తో ఎడ్లు మృతి



విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఎడ్లు

ఇచ్చోడ, ఏప్రిల్ 19 : విద్యుత్ షాక్‌తో ఐదు ఎడ్లు మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం.. కేశవ్‌పట్నం గ్రామంలో శుక్రవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వర్షానికి విద్యుత్ తీగలు కింద పడ్డాయి. శనివారం ఉదయం మేతకు వెళ్లిన ఐదు ఎడ్లు విద్యుత్ తీగలకు తగిలి మృతి చెందాయి. ఎడ్లు విలువ రూ.2 లక్షలు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు షైక్ అలీ, షేక్ ఖలీల్, ఇస్మాయిల్, జుమ్మా, షైక్ ఖమర్ కోరారు.



ఆదిలాబాద్ పట్టణంలో నిర్మానుష్యంగా రోడ్లు

## భానుడి భగ భగ

- 43.1 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు
- రాష్ట్రంలోనే ఆదిలాబాద్ జిల్లాలో అధిక ఉష్ణోగ్రతలు



ఎండకు తాలలేక గొడుగు పట్టుకుని వెళ్తున్న విద్యార్థినులు

ఆదిలాబాద్ జిల్లాలో ఎండలు మండి పోతున్నాయి. సీజన్ ప్రారంభం నుంచి భానుడు ప్రతాపం చూపుతుండగా.. శనివారం సీజన్‌లోనే అధికంగా 43.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ఎండ తీవ్రత సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతున్నది. మండుతున్న ఎండల కారణంగా ప్రధాన రహదారులు, వీధులు జన సంచారం లేక కనిపిస్తున్నాయి. గొడుగులు వాడుతూ క్యాప్‌లు, తలకు కర్చీఫ్‌లు ధరిస్తున్నారు. కొబ్బరి బొండాలు, చల్లటి పానీయాలు సేవిస్తున్నారు. ఉక్కపోత నుంచి ఉపశమనం పొందడానికి ఇండ్లలో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్లను వినియోగిస్తున్నారు. జిల్లాలో ఎండల ప్రభావం ఎక్కువగా ఉన్నందునా ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు.

- ఆదిలాబాద్, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ)

## భూ భారతితో రైతులకు చేసిందేమి లేదు

భూ భారతి పేరిట పర్యటిస్తున్న మంత్రులు పొంగులేటి శ్రీనివాస్, సీతక్కలు రైతులకు చేసింది ఏమీ లేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. శనివారం ఆదిలాబాద్ జిల్లా బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ మంత్రి జోగు రామన్న కార్యకర్తలతో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి దిశానిర్దేశం చేశారు. మొదట పార్టీ కార్యాలయంలో రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం జోగు రామన్న మాట్లాడుతూ.. ఈనెల 27న కేసీఆర్ చేపట్టే సభ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. కాంగ్రెస్ బెదిరింపులు, అరెస్టులకు బీఆర్‌ఎస్ పార్టీ కార్యకర్తలు ఎప్పుడు కూడా వెనకడుగు వేయద్దన్నారు. అలాగే కేసీఆర్ సభా వేదిక ద్వారా కార్యకర్తల్లో నూతనోత్సాహాన్ని నింపనున్నారు. ఈ కార్యక్రమంలో. మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, అలాల్ అజయ్, నారాయణ, ప్రహ్లాద్, అష్రాఫ్, యూనిస్ అక్బాని, సాజిదుద్దీన్, సలీం పాషా, కస్తాల ప్రేమల, స్వరూప, బొడగం మమత పాల్గొన్నారు. - ఎదులాపురం, ఏప్రిల్ 19



రజతోత్సవ సభ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి జోగు రామన్న, బీఆర్‌ఎస్ నాయకులు

## మార్కెట్ చైర్మన్ పదవి ఇవ్వండి

**మంత్రి వాహనాన్ని అడ్డుకున్న కాంగ్రెస్ నాయకుడు**



మంత్రి సీతక్కతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు దర్శనాల చంటి

కాంగ్రెస్ పార్టీలో సీనియర్ నాయకుడిగా ఉన్న తనకు ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి ఇవ్వాలంటూ ఆ పార్టీ సీనియర్ నాయకుడు దర్శనాల చంటి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క వాహనాన్ని అడ్డుకున్నాడు. రెండు రోజులుగా జిల్లాలో పర్యటిస్తున్న మంత్రి సీతక్క శనివారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో దివ్యాంగులకు సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమానికి హాజరయ్యారు. తిరిగి వెళ్తుండగా వాహనాన్ని అడ్డుకున్న చంటి ఎన్నో ఏళ్లుగా పార్టీకి సేవలు అందిస్తున్న తనను కాదని జిల్లా నాయకులు ఇతరులకు పదవి ఇవ్వడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ఆయనతో మాట్లాడిన మంత్రి తగు నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

- ఆదిలాబాద్, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ)

# మంత్రి మీటింగ్‌కు ఎమ్మెల్యేలు డుమ్మా!

**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధి సమీక్షకు హాజరుకాని మంచిర్యాల శాసనసభ్యులు**

- మొన్న సీఎల్పీ మీటింగ్‌కు దూరం.. నేడు మంత్రి సీతక్క సమావేశానికి గైర్హాజరు
- మంత్రి పదవి కోసం ఎవరి పట్టు వారిదే.. అందుకే సమావేశాలకు దూరం

మంచిర్యాల, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవి రచ్చ కొనసాగుతూనే ఉన్నది. ఎమ్మెల్యేలు సమీక్షలు.. సమావేశాలు పక్కనపెట్టి పదవి దక్కించుకునే ప్రయత్నాల్లోనే ఉంటున్నట్లు తెలుస్తున్నది. శనివారం నిర్మల్ జిల్లాలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అభివృద్ధిపై మంత్రి సీతక్క సమీక్ష నిర్వహించగా, మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు గైర్హాజరవడం ఇందుకు బలం చేకూరుస్తున్నది. గతవారం మినిస్టర్ పదవి విషయమై మంచిర్యాలలో నిర్వహించిన మీటింగ్‌లో స్థానిక ఎమ్మెల్యే పీఎస్ఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తనకు అన్యాయం చేస్తే సహించేది లేదంటూ హెచ్చరించారు. ఆ కుటుంబంలో ఇప్పటికే మూడు పదవులు ఉన్నాయని, మరొకటి ఇస్తానంటే ఆదిలాబాద్‌కు అన్యాయం చేసేనట్లేనని 'కాక' కుటుంబాన్ని ఉద్దేశించి మాట్లాడారు. అదే రోజు జైపూర్ మండలంలో జరిగిన ఓ సమావేశంలో చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్, బెల్లంపల్లిలో ఎమ్మెల్యే వినోద్ పీఎస్ఆర్ వ్యాఖ్యలను ఖండించారు. బీజేపీలో ఉంటే తాను కేంద్ర మంత్రిని అయ్యేవాడినని, సీఎం రేవంత్‌రెడ్డి పిలిస్తేనే పార్టీలోకి వచ్చానని వివేక్.. 70 ఏండ్లుగా కాంగ్రెస్ పార్టీలోనే తమ కుటుంబం ఉందని.. సీనియర్‌గా మంత్రి పదవి అడగడంలో తప్పేమిటని వినోద్ చెప్పుకొచ్చారు. ఈ వ్యవహారం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయంశంగా మారిన నేపథ్యంలో గత మంగళవారం హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన సీఎల్పీ మీటింగ్‌కు మంచిర్యాల ఎమ్మెల్యేలు హాజరు కాలేదు. బెల్లంపల్లి ఎమ్మెల్యే ఆలస్యంగా ఆ రోజు మధ్యాహ్నం సీఎల్పీ సమావేశానికి వెళ్లినప్పటికీ వివేక్, పీఎస్ఆర్ మొత్తానికే గైర్హాజరయ్యారు. మంత్రి పదవి విషయంలో పరస్పర ఆరోపణలు, అధిష్టానంపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో ఈ ఇద్దరినీ సమావేశానికి పార్టీ పెద్దలు రావొద్దన్నారంటూ, ఆ ఇద్దరు ఎమ్మెల్యేలు కావాలనే సమావేశానికి వెళ్లలేదనే ప్రచారం జరిగింది. ఈ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రివర్గ విస్తరణపై అధిష్టానం ఇప్పటికే తన నిర్ణయాన్ని నిలిపివేసిందని.. ఎమ్మెల్యేలెవరూ ఈ విషయంలో అనుచిత వ్యాఖ్యలు చేయొద్దంటూ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మంత్రి పదవి కోసం పోటీ పడుతున్న మంచిర్యాల ఎమ్మెల్యే అంతర్గత విబేధాలు తారాస్థాయికి చేరినట్లు తెలుస్తున్నది. మొన్నటి వరకు లోలోపల జరిగిన పోటీ.. పరస్పర వ్యాఖ్యల నేపథ్యంలో జిల్లాలో హాట్ టాపిక్‌గా మారింది. మంత్రి పదవి కోసం ఎవరి ప్రయత్నాలు వారు ముమ్మరం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో నిర్మల్ జిల్లాలో శనివారం ఉమ్మడి జిల్లా అభివృద్ధిపై మంత్రి సీతక్క ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలోని అందరు ఎమ్మెల్యేలు, జిల్లా ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. కాగా, మంచిర్యాల జిల్లాకు చెందిన ముగ్గురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఈ మీటింగ్‌కు గైర్హాజరవడం మరోసారి చర్చనీయాంశంగా మారింది. పార్టీలో విబేధాలు తారాస్థాయికి చేరిన నేపథ్యంలో ఎమ్మెల్యేలు మీటింగ్ రాలేదనే చర్చ నడుస్తున్నది.

# మానని గాయానికి 44 ఏండ్లు

**నేడు ఇంద్రవెల్లి అమరవీరుల సంస్మరణ దినోత్సవం**

**నివాళులు అర్పించేందుకు సిద్ధమైన ఆదివాసులు**



ఇంద్రవెల్లిలోని అమరవీరుల స్మారక స్తూపం

ఇంద్రవెల్లి, ఏప్రిల్ 19 : ఇంద్రవెల్లి ఘటనకు నేటి(ఆదివారం)తో 44 ఏళ్లు పూర్తయ్యాయి. ప్రపంచ చరిత్రలో నిలిచిన ఏప్రిల్ 20, 1981 రోజును ఆదివాసీ గిరిజనులు ఎన్నటికీ మరువరు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమరవీరుల సంస్మరణ దినోత్సవం సభను అధికారికంగా నిర్వహించేందుకు ఐటీడీఏ ద్వారా ఏర్పాట్లు పూర్తి చేయడంతో ఉమ్మడి జిల్లా ఏజెన్సీలోని ఆదివాసీ గిరిజనులతోపాటు అమరవీరుల కుటుంబ సభ్యులు తరలిరానున్నారు.

### ఆ రోజు జరిగిందిలా..

బుక్కెడు బువ్వ కోసం పడరాని పాట్లు పడుతున్న గిరిజనులు జల్, జంగల్, జమీన్ కోసం ఉద్యమించిన అడవిబిడ్డలపై అప్పటి సర్కారు తుపాకీ గురిపెట్టి తూటాల వర్షం కురిపించింది. పోలీసులు విచక్షణా రహితంగా కాల్పుల జరపడంతో అనేక మంది గిరిపుత్రులు అసువులు బాశారు. ఆ రక్తపు మరకలు ఇప్పటికీ చెరిగిపోలేదు. 44 ఏళ్ల క్రితం గిరిజనులు, వ్యాపారులు అధికారుల చేతుల్లో అనేక రకాలుగా దోపిడీకి గురయ్యారు. గిరిజనులు నోరువిప్పితే చాలు అధికారులు చావబాదేవారు. ఈ క్రమంలో నక్సలైట్ల ఉద్యమం విస్తరిస్తుంది. వారిని అణచి వేయడానికి గిరిజన గూడేల్లో పోలీసుల బూట్ల చప్పుళ్లు ప్రారంభమయ్యాయి. అష్టకష్టాలు పడుతున్న గిరిజనులు ఎవరు పోరాటం చేసినా కలిసిరావడానికి సన్నద్ధమయ్యారు. ఈ తరుణంలో నక్సలైట్లు భూ పంపిణీ చేయాలని అప్పటి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో గిరిజనులు అడవుల్లో ఖాళీగా ఉన్న భూములను దున్నడం ప్రారంభించారు. అయిన అప్పటి ప్రభుత్వం స్పందించకపోవడంతో పలు సంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి 1981, ఏప్రిల్ 20న ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. దీనికి అప్పటి ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అయిన వెనక్కి తీసుకునే ప్రసక్తి లేదని గిరిజన సంఘాలు ప్రకటించాయి.

### ఏప్రిల్ 20, 1981న జరిగిన ఘటన

ఏప్రిల్ 20, 1981న సోమవారం ఉదయం నలు దిక్కుల నుంచి గిరి జనులు భారీ సంఖ్యలో తరలి వచ్చారు. మధ్యాహ్నం 3 గంటలకు ఇంద్రవెల్లి అంతా గిరిజనులతో నిండింది. సమావేశం జరగకుండా పోలీసులు విశ్వప్రయత్నాలు చేశారు. వాహనాలు రాకుండా రహదారులను దిగ్బంధించారు. గిరిజనులను చూసిన పోలీసుల గుండెల్లో రైళ్లు పరిగెత్తాయి. సభాస్థలానికి గిరిజనులు ర్యాలీగా బయలుదేరారు. అప్పటి ప్రభుత్వం తాడోపేడో తేల్చుకోవాలని కసితో ఉంది. వేలాదిమందితో వస్తున్న గిరిజనుల ర్యాలీని పోలీసులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఓ జవాన్ గిరిజన యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. ప్రాణం కంటే శీలం ముఖ్యమనుకున్న ఆ యువతి జవాన్‌పై చేతిలో ఉన్న ఆయుధంతో దాడి చేసింది. అంతే.. ఆ జవాన్ నేలకొరిగాడు. దీంతో పరిస్థితి చేయిదాటి పోవడంతో పోలీసులు తుపాకులకు పని చెప్పారు. తుపాకుల శబ్దంతో ఇంద్రవెల్లి దద్దరిల్లింది. గిరిజనులపై పోలీసులు తూటాల వర్షం కురిపించారు. దీంతో వందలాది మంది గిరిజనులు నేలకొరిగారు. చుట్టూ పక్కల పచ్చని చెట్లు ఎర్రగా మారాయి. గోండుల రక్తం భూమిపై ఏరులై పారింది. ఎటు చూసినా ఎర్రని రక్తపు మడుగులు కనిపించాయి. వందలాది మంది గిరిజనులు అరుపులు, కేకలతో వాగుల వెంట పరుగులు తీశారు.

**అమరులు వీరే..**

పిట్టబొంగురం గ్రామానికి చెందిన మడావి రాము, వడగాంకు చెందిన కనక సోము, కోయల్‌పాండ్రికు చెందిన తోడసం భీంరావ్, గౌరాపూర్‌కు చెందిన హెరే కుమ్రం జగ్గు, బోథ్ మండలంలోని సాంగ్వి(కౌట)కు చెందిన మండాడి జంగు, ఇంద్రవెల్లి మండలంలోని డోంగర్‌గాంకు చెందిన కోవా రాము, గౌరాపూర్‌కు చెందిన సిడాం బాపురావ్, తాటిగూడకు చెందిన సెడ్మకి కోద్దు, (మోహన్‌గూడ) తేజాపూర్‌కు చెందిన ఆర్కా గంగు, గౌరాపూర్‌కు చెందిన మంగం ముత్తు, పిట్టబొంగురంకు చెందిన కోట్నాక్ గంగు, సిరికొండ మండలంలోని నిజామ్‌గూడకు చెందిన పెందూర్ భీంరావ్, పాండుగూడకు చెందిన పెందూర్ మచ్చు, పాండుగూడకు చెందిన పెందూర్ గంగారాం, సోన్‌పల్లికు చెందిన పెందూర్ సుంగులు పోలీసుల కాల్పులో మృతి చెందినారు.

కానీ.. సీమాంధ్ర పాలకులు బాధితులకు ప్రభుత్వపరంగా సంతృప్తికరమైన సాయం అందించలేదు. దీంతో వారు దుర్భార జీవితాలు గడుపుతున్నారు. కాల్పుల ఘటన సాక్షిగా ఇంద్రవెల్లి సమీపంలోని హీరాపూర్ గ్రామం వద్ద అమరవీరులు స్తూపం ఏర్పాటు చేశారు. యేటా ఏప్రిల్ 20న అమరవీరులకు ఆదివాసీ గిరిజనులు వారి సంప్రదాయం ప్రకారం ఘనంగా నివాళులర్పిస్తూ అమరవీరుల దినోత్సవం జరుపుకుంటున్నారు.

### అధికారికంగా ఏర్పాట్లు

అమరవీరుల సంస్మరణ దినోత్సవ సభ నిర్వహణ కోసం ఉట్నూర్ ఐటీడీఏ ద్వారా అధికారికంగా ఏర్పాట్లు పూర్తి చేశారు. 150 మందితో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. ఆదివాసీ గిరిజనులు స్వచ్ఛగా నివాళులర్పించుకోవచ్చన్నారు. అమరవీరుల స్తూపం వద్ద పోలీసుల ఎలాంటి ఆంక్షలు విధించలేదు.

## తునికాకు సేకరణను అడ్డుకుంటున్నారని నిరసన



తునికాకు సేకరణను అడ్డుకుంటున్నారని నిరసన తెలుపుతున్న ప్రజలు

పెంబి, ఏప్రిల్ 19 : మండలంలో తునికాకు సేకరణను అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని పెంబి గ్రామస్తులు శనివారం నిరసన తెలిపారు. మండల కేంద్రానికి చెందిన పలువురు ఉపాధి కోసం అటవీ ప్రాతంలో తునికి ఆకు సేకరిస్తారు. శనివారం ఉదయం అటవీ ప్రాతం నుంచి తునికి ఆకు సేకరించుకుని వస్తుండగా.. అధికారులు తునికి ఆకు ముల్లెలను స్వాధీనం చేసుకున్నారని వాపోయారు. తునికి ఆకు సేకరణను అడ్డుకుని మా కడుపు మీద కొట్టవద్దని వేడుకున్నారు. తక్షణమే మండల కేంద్రంలో తునికి ఆకు కల్లం ఏర్పాటు చేసి తునికి ఆకు సేకరణకు అనుమతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గుండు శంకర్, పటేల్ రమేశ్, గైని మహేందర్, దావుల రాజన్న ఉన్నారు.

## విద్యార్థి గల్లంతు



వాగులో గల్లంతైన విద్యార్థి రాంచరణ్

లక్ష్మణచాంద, ఏప్రిల్ 19 : మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన 8వ తరగతి విద్యార్థి మద్దెల రాంచరణ్ శనివారం గల్లంతయ్యాడు. స్థానికుల వివరాల ప్రకారం.. వడ్యాల్ గ్రామానికి చెందిన మద్దెల గంగన్న-లక్ష్మీల రెండో కుమారుడు రాంచరణ్(13) శనివారం పాఠశాలకు వెళ్లివచ్చి తన స్నేహితులతో వాగులో ఈతకు వెళ్లాడు. కానీ.. సాయంత్రం చీకటి పడినా తిరిగి ఇంటికి రాకపోయే సరికి తల్లిదండ్రులు వెతకడం ప్రారంభించారు. వాగు వైపు స్నేహితులతో కలిసి వెలుతుండగా చూసిన గ్రామస్తులు వారి తల్లిదండ్రులకు సమాచారం అందించారు. వాగు దగ్గర అతని చెప్పులు, దుస్తులు కనిపించడంతో అవి తమ కుమారుడివని ధ్రువీకరించుకున్నారు. వాగులో గల్లంతైనట్లు వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు భావిస్తున్నారు. రాత్రి పడడంతోపాటు, వాగులో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడం వెతకడానికి ఇబ్బందిగా మారింది. ఆదివారం ఉదయం అతని జాడ తెలిసే అవకాశం ఉన్నట్లు గ్రామస్తులు పేర్కొంటున్నారు.

## ఇందిరమ్మ కమిటీల్లో గందరగోళం

**పేర్లు తొలిగించారని అధికారులతో వాగ్వాదం**

ముథోల్, ఏప్రిల్ 19 : ఇందిరమ్మ ఇండ్లకు అర్హుల ఎంపిక కోసం గ్రామ స్థాయిలో ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించింది. ఇందిరమ్మ కమిటీల ఆధ్వర్యంలో కారేగాం గ్రామంలో సభ నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. కానీ.. అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో శనివారం మండలస్థాయిలో ఇందిరమ్మ కమిటీల సమాశాన్ని అధికారులు నిర్వహించారు. మా పేరు ఎందుకు లేవంటూ కారేగాం గ్రామానికి చెందిన మెత్రి నారాయణ, గంగారెడ్డిలు ఈ సమావేశంలో అధికారులతో వాగ్వాదానికి దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కమిటీలను ఇష్టారీతిన ఏర్పాటు చేసేదుంటే గ్రామసభలు ఎందుకు నిర్వహించారని ప్రశ్నించారు. ఇది కేవలం కాంగ్రెస్ కమిటీలను ఎన్నుకోవడమేనని మండి పడ్డారు. గతంలో ఏర్పాటు చేసిన కమిటీని కొనసాగించాలని, లేనట్లయితే పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో శివ కుమార్, ఎస్సై సంజీవ్ కల్పించుకుని కమిటీల లిస్టు పైనుంచి వచ్చిందని, తమ ప్రమేయం లేదని తెలిపారు. అయినప్పటికీ వారు ఒక దరఖాస్తు రాసి ఇచ్చినట్లయితే దానిని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరించేలా చూస్తామని చెప్పడంతో శాంతించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.



కమిటీలో పేర్లు రాకపోవడంతో అధికారులను ప్రశ్నిస్తున్న కారేగాం గ్రామ యువకులు